ఆస్తులను అమ్మరాదు

కాచిగూడ, మార్చి 28: ప్రజల ఆస్తులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదని, ప్రజలు వేలం పాటలో పాల్గొని భూములు కొనుగోలు చేయరాదని, కొంటే విద్యార్థి సంఘాలతో కలిసి స్వాధీనం చేసుకుంటామని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం నింబోలి అడ్డా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 295 గురుకుల హాస్టళ్లు ఉన్నాయని, వాటిలో ఒక్కటికి కూడా సొంత భవనం లేదని, సీఎం రేవంత్ రెడ్డికి విద్యార్థులపై ప్రేమ ఉంటే ప్రభుత్వ భూముల్లో గురుకుల భవనాలను నిర్మించి, నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు. భూముల విషయంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రికి త్వరలో ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. కృష్ణ, సత్య ప్రకాశ్, భూషణ్ భాస్కర్, రాజేశ్, డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

బంగారు లక్ష్మమ్మ ఆలయంలో పూజలు

తెలుగు యూనివర్సిటీ : నిలోఫర్ దవాఖాన ఆవరణలో గల శ్రీ బంగారు లక్ష్మమ్మ దేవాలయంలో ఆసుపత్రి ఉద్యోగులు రవీందర్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, అంజి, నిర్మలాదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దవాఖాన వైద్యులు డాక్టర్ లాలూప్రసాద్, కిరణ్, శ్రీకాంత్, రమ్య, ఏఓ పావని పాల్గొని హోమం, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ తదితర కార్యక్రమాలను పంతుళ్లు నర్సింహ నరేశ్, నిఖిల్ పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

డీసీ లావణ్యకు శుభాకాంక్షలు

అబిడ్స్ మార్చి 28: జీహెచ్ఎంసీ 14 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా నియమితులైన దుబ్బాక లావణ్యను గన్ ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమత సంతోష్ గుప్తా దంపతులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మమతా సంతోష్ గుప్తా మాట్లాడుతూ నూతన డిప్యూటీ కమిషనర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన లావణ్య జీహెచ్ఎంసీ ఆదాయాన్ని పెంచడంతోపాటు ప్రజల పౌర సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ,మార్చి 28: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లలో 42శాతం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, షెడ్యూల్ 9 లో పొందుపరిచే విధంగా చూడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. శుక్రవారం కాచిగూడ అభినందన హోటలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేసి, దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీసీ విద్యార్థులకు 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్, అనంతయ్య, రఘుపతి, ఉదయనేత, తదితరులు పాల్గొన్నారు.

31న రవీంద్రభారతిలో మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్ ఫెస్టివల్

తెలుగు యూనివర్సిటీ, మార్చి 28. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మార్చి 31న మధ్యాహ్నం 2 గంటల నుంచి రవీంద్రభారతి మొదటి అంతస్థులో గల సమావేశ మందిరంలో మిమిక్రీ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిమిక్రీ, వెంట్రిలాక్విజం కళాకారులు పాల్గొననున్న మిమిక్రీ సింఫనీ ఫెస్టివ్ హార్మొనీ శీర్షికతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిమిక్రీ కళాకారుల సంఘం అధ్యక్షుడు జీవీఎన్ రాజు శుక్రవారం తెలిపారు. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టులు శివారెడ్డి, భవిరి రవి, జితేంద్రనాథ్, ఆర్‌పీఎం రాజు, గురుస్వామి, మల్లం రమేశ్, శాంతికుమార్, రాకింగ్ రాకేశ్, అంజన్ కుమార్, శివప్రసాద్, శివ భవిరి, రాంబాబు, అశోక్, సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, కపర్తి నరేశ్, శంకర్, మురళీకృష్ణ, యాదవ్ తదితరులు ప్రేక్షకులను అలరించే మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్ అంశాలను వేదికపై ప్రదర్శించి ఈ కళను భావితరాలకు అందించవలసిన ఆవశ్యకతపై ప్రసంగించనున్నారని తెలిపారు. ప్రత్యేక సంగీత విభావరిలో కళాకారులు ఆహుతులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేయనున్నారని ఆయన పేర్కొన్నారు. యాంత్రిక జీవనశైలిలో ఒత్తిడితో గడుపుతున్న సమాజానికి మిమిక్రీ ఆర్టిస్టులు తమలోని ప్రతిభతో ఉపశమనం కలిగిస్తున్నారని ఆయన అన్నారు.

సిలిండర్ సరఫరాలో జాప్యం ఉండదు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 28, ఎల్పీజీ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బల్క్ ఎల్పీజీ రవాణాదారుల సమ్మె నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్పీసీఎల్) తమ ఎల్పీజీ వినియోగదారులకు తగినంత సిలిండర్ సరఫరా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చాయి. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల బాట్లింగ్ ప్లాంట్లలో బల్క్ ఎల్పీజీ నిల్వలు తగినంత ఉన్నాయన్నారు. ఎల్పీజీ పంపిణీ కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రవాణా టెండర్‌ను అన్ని ప్రాంతాల ట్రాన్స్‌పోర్టర్లతో విస్తృత చర్చల తర్వాత తుది రూపం ఇచ్చారన్నారు. ఈ ప్రక్రియలో రవాణాదారుల వివిధ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమైన సందేహాలను నివృత్తి చేసేందుకు వివరణలు ఇచ్చారన్నారు. చెన్నై, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, గువాహటి నగరాల్లో నిర్వహించిన ప్రీ-బిడ్ సమావేశాల ద్వారా వారి అభిప్రాయాలను కూడా కలుపుకున్నారన్నారు. ఈ టెండర్ నిబంధనలను ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు, కేంద్ర విజిలెన్స్ మార్గదర్శకాలను పాటిస్తూ పూర్తిగా పారదర్శకంగా రూపొందించారని పేర్కొన్నారు. ఈ నిబంధనలు పీఈఎస్ఓ, పీఎన్జీఆర్బీ, ఓఐఎస్డీ వంటి చట్టబద్ధ సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించారన్నారు. ఎల్పీజీ రవాణా భద్రత, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మా ప్రయత్నాల్లో భాగంగా ఈ కొత్త టెండర్ నిబంధనలను తీసుకువచ్చామన్నారు. ఈ చర్యలు తీసుకున్నప్పటికి కొంత మంది రవాణాదారులు సమ్మెకు పిలుపునిచ్చారన్నారు. ప్రధానంగా భద్రతా ఉల్లంఘనలకు సంబంధించిన శిక్షా నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే, ఈ భద్రతా సంబంధిత చర్యలు ట్యాంకర్ యజమానులు, డ్రైవర్లు, వినియోగదారులు సహా అన్ని స్టేక్‌హోల్డర్లకు లాభదాయకంగా ఉంటాయని తెలిపారు. అవి మరింత భద్రతా ప్రమాణాలు కలిగిన, విశ్వసనీయమైన ఎల్పీజీ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడంలో సహాయపడుతాయని పేర్కొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మెహదీపట్నం, మార్చి 28): నీటిని పొదుపుగా వాడుకుంటేనే మన భవిష్యత్తు తరాలకు నీటిని అందించగలుగుతామని నీటి సంరక్షణ ప్రతినిధి దొర బాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం లంగర్ హౌస్ కాళిదాసుపుర లలితా నగర్ లోని ఏర్పాటు చేసిన వరల్డ్ వాటర్ డే ను పురస్కరించుకొని నీటి సంరక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా బస్తీలోని ప్రతి ఇంటి ముందు నీటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటే వేసవిలో వచ్చే నీటి ఎద్దడిని అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు ప్రకాశ్ బాబు, విజయ్ ప్రకాశ్ తివారి, సతీశ్ ప్రసాద్ తివారి, రఘువీర్ ప్రసాద్ తివారి, మోహన్ సింగ్ కృష్ణ, బాబురావు, జ్ఞానేశ్వర్ దయాల్ తివారి, దేవేందర్ తివారి, రవీంద్రనాథ్ తివారి పాల్గొన్నారు.

30 నుంచి జిమ్నాస్టిక్స్ లో ఉచిత శిక్షణ

జూబ్లీహిల్స్, మార్చి 28: విష్ణునగర్ జిమ్నాస్టిక్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జిమ్నాస్టిక్స్ లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఇనిస్టిట్యూట్ ప్రధాన కార్యదర్శి బి. బాల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని కేవీబీఆర్ స్టేడియం ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. సమ్మర్ కోచింగ్‌లో భాగంగా నగరంలోని మా సబ్‌ట్యాంక్ మహవీర్ హాస్పిటల్ ప్రాంతంలోని సీఐబీ క్వార్టర్స్‌లోని ఇనిస్టిట్యూట్ లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేటి నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. బీఏ లాంగ్వేజెస్ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు.

పెన్షనర్లకు రూ. 9 వేల వరకు పెంచాలి

ధర్నా చేస్తున్న పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కాచిగూడ, మార్చి 28: కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు రూ.9 వేల వరకు పెంచాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ మూర్తి డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో బర్కత్‌పుర ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు శుక్రవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పెన్షన్ దారులందరికీ వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయ్యర్ పెన్షన్ పై అభ్యంతరాలు లేకుండా అందరికీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈపీఎఫ్ 95 పెన్షనర్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, సీనియర్ సిటిజనులకు రైల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు బర్కత్‌పుర ఈపీఎఫ్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ రిటైర్డ్ అసోసియేషన్ ప్రతినిధులు నరహరి, నర్సింగరావు, బ్రహ్మచారి, నాగేశ్వరరావు, సోమయ్య పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య సేవలు మరువలేనివి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం

అబిడ్స్ మార్చి 28: దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం తెలిపారు. దొడ్డి కొమరయ్య ఉత్సవ కమిటీ వాల్ పోస్టర్‌ను ఆయన కమిటీ చైర్మన్ తూముకుంట అరుణ్ కుమార్ తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య పోరాటం మరువలేనిది అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఆయన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంపై మల్లేశం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఉత్సవ కమిటీ ప్రతినిధులను మల్లేశం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ తూంకుంట అరుణ్ కుమార్, మంగా వెంకటేశ, దొడ్డి చంద్రం, కనకాల ఐలేందర్,రావుల సుధాకర్,కొత్త కురుమ శివకుమార్, సత్యనారాయణ, గౌరి సతీశ్, కమలాకర్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం

అబిడ్స్, మార్చి 28: గోడేకి కబర్ ప్రాంతంలోని ఓ మిఠాయి దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దుకాణం మూసిన తర్వాత షార్ట్ సర్క్యూట్ జరగగా అందులో ఉన్న సిలిండర్ పేలి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న షాహి నాయత్ గంజ్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని అగ్ని మాపక సిబ్బందిని రంగంలోకి దింపడంతో వారు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణం నష్టం జరగలేదు.

మక్కా మసీదులో ప్రార్థనలు

పాతనగరంలో పర్యటిస్తున్న నగర్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్ మార్చ్ 28 : రంజాన్ మాసపు చివరి శుక్రవారం ప్రార్థనలు మక్కా మసీదులో ప్రశాంతంగా ముగిసాయి. రంజాన్ జుమాతుల్ విదా ప్రార్థనల్లో పాల్గొనడానికి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం లు భారీ ఎత్తున తరలి వచ్చారు. మండు టెండలను సైతం లెక్క చేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు చేశారు. దీంతో చార్మినార్ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బందోబసుకు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, శాంతి, సంఘం సభ్యులు ప్రార్థనలకు హాజరైన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపి ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. చార్మినార్ మక్కా మసీదు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో ఎమ్మెల్యేలు జుల్ఫాకర్ అలీ మేరాజ్ హుస్సేన్, అహ్మద్ బలాల తదితరులు ముస్లింలకు జుమ్మా అల్విద శుభాకాంక్షలు తెలియచేశారు.

బందోబస్తు పర్యవేక్షించిన సీపీ

రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు పురస్కరించుకొని నగర సీనీ సీవీ ఆనంద్, దక్షిణ మండల ం డీసీపీ స్నేహ మెహరా తదితరులు బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జుమాతుల విదాను పురస్కరించుకొని గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంజాన్ పండుగ ప్రశాంతంగా ముగిసిలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పోలీసులు, ప్రజల సహకారంతో ఇరువర్గాల పరజలు శాంతియుతంగా జరుపుకునేలా చర్యలు. తీసుకున్నట్లు వివరించారు.

ట్యాంకర్ల సహాయంతో నీళ్లు..

జీహెచ్ఎంసీ చారిమినార్ జోన్, జోనల్ కమిషనర్ వెంకన్న ఆధ్వర్యంలోచార్మినార్ డిప్యూటీ కమిషనర్ తదితర అధికారుల బృందం జుమాతుల విదా ప్రార్థనలను పురస్కరించుకొని చారిత్రక చార్మినార్, పాదచారుల జోన్ ప్రాంతంలో సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. వాటర్ ట్యాంకర్ల సహాయంతో నీటితో బండలను శుభ్రం చేశారు. మండు టెండల నుంచి భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన జానిమాస ఏర్పాటు చేశారు.

షబ్బే ఏ ఖదార్ ..

రంజాన్ మాసం లోని చివరి శుక్రవారం సందర్భంగా పాతనగరం లో బందోబస్తు ను నగర్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఇతర ఉన్నతధికారులతో కలిసి శుక్రవారం తెల్లవారు జామున పరిశీలించారు.రాత్రి బజార్ ను సందర్శిస్తు వ్యాపార వర్గాలతో కలిసి ముచ్చటించారు

బార్‌ల సమస్యలు పరిష్కరించాలి

ధర్నా చేస్తున్న యజమానులు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 2: నాంపల్లి లోని ఆబ్కారీ శాఖ కార్యాలయం ఎదుట తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ మాట్లాడుతూ బార్ ల చుట్టూ వైన్ షాప్ లకు పర్మిట్ రూమ్ లు ఉండడం వల్ల బార్ లకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పర్మిట్ రూమ్ ల వల్ల బార్ లకు కస్టమర్లు రాకపోవడంతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వ్యాపారం లేక బార్ల యజమానులు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్మిట్ రూమ్, బెల్ట్ షాపులతో గ్రామాలలో,బస్తీలలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైన్ షాపులకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకే ఉన్నది..కానీ జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం 10 గంటల నుంచి రాత్రి 11 వరకు కొనసాగుతున్నాయి. జిల్లాలలో ఉన్న వైన్ షాప్ ల సమయపాలనను, హైదరాబాద్ పరిధిలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే,బార్ ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని దామోదర్ గౌడ్ డిమాండ్ చేశారు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు సిద్ధార్థ్ ముదిరాజ్

గోల్నాక, మార్చి 28: పవిత్ర రంజాన్ మాసాంతం ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అంబర్ పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం అంబర్ పేట ఓవైసీ నగర్ లో బీఆర్ఎస్ నాయకుల షకీల్, మక్బుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మనషులంతా సోదర భావంతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నజయ్‌ముదిరాజ్, నరేంద్రముదిరాజ్, దశరథ్, రాజేశ్ కాశి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్

అబిడ్స్ మార్చి 28: గోషామహల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్ కుమార్ గౌడ్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బంజారా హిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాద పూర్వకంగా కలిసి గోషామహల్ లో సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. గోషామహల్ లో అక్రమ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ కు విన్నవించారు. జ్ఞాన్ బాగ్ కాలనీ లో ప్రభుత్వ స్థలాలోనూ అధికారులు అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని, ఆధారాలతో సహా జీహెచ్ఎంసీ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని, పాన్ మండి సమీపంలో 4వేల చదరపు గజాల స్థలానికి ఎలాంటి లేఅవుట్ లేకుండా అక్రమంగా అనుమతులు ఇచ్చారని మంత్రి కి ఆనంద్ కుమార్ గౌడ్ వివరించారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

మెహదీపట్నం మార్చి 28: బస్సులలో ప్రయాణిస్తూ చైన్ స్నాచింగ్ చేస్తున్న వ్యక్తిని హుమ్యూన్ నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.ఈ మేరకు మెహిదీ పట్నంలోని దక్షిణ,పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయంలో డీసీపీ చంద్రమోహన్, ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ శ్రీనివాస్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం విజయనగర్ కాలనీలో గుర్తుతెలియని ఆగంతకుడు దొంగ బంగారాన్ని అమ్మడానికి రాగా పోలీస్‌లకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు అతడిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా అతడు మల్లెపల్లి మంగర్ బస్తీ కి చెందిన లక్ష్మణ్ రాథోడ్ గా తేలింది. తనతో పాటు మరో ఇద్దరు కలిసి బస్సులలో ప్రయాణికుల మెడలో నుంచి చైన్లు దొంగతనం చేస్తున్నట్లు లక్ష్మణ్ రాథోడ్ పోలీసులకు చెప్పాడు. నల్గొండకు చెందిన మోహన్ రెడ్డి 27వ తేదీ రాత్రి మెహదీ పట్నం కు బస్సులో వచ్చాడు. మెహదీపట్నంలో దిగి చూడగా అతడి మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైంది. అతడు వెంటనే హుమయున్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు గొలుసును చోరీ చేసింది లక్ష్మణ్ రాథోడ్ ముఠాగా గుర్తించారు. దొంగ వద్ద నుంచి మూడున్నర తులాల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిబంధనలు పాటించాలి

చలాన్ విధిస్తున్న ట్రాఫిక్ ఏఎస్ఐ అనిల్ గౌడ్

కాచిగూడ, మార్చి 28: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు జరుగవని కాచిగూడ ట్రాఫిక్ ఏఎస్ఐ అనిల్ గౌడ్ అన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం బర్కత్‌పురా చమాన్ సమీపంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హెల్మెట్ వాడకం, ఓవర్ టేక్ డ్రైవింగ్, రాంగ్ రూట్లో వెళ్లే వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలని, యువత ఓవర్ స్పీడ్ లో వెళ్లడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారు రోడ్డు ప్రమాదాలకు అధికంగా గురవుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు

లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి

డీజీఎంకు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, మార్చి 28: అంబర్‌పేట డివిజన్ ఎంసీహెచ్ కాలనీలో మంచినీటి లోప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావును కలిసి విన్నవించారు. శుక్రవారం ఆయన ఎంసీహెచ్ కాలనీలో పర్యటించగా స్థానిక కాలనీ వాసులు మంచినీటి లోప్రెషర్ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కార్పొరేటర్ డీజీఎం ను కలిసి రాబోయే ఉగాది, రంజాన్ పండుగలతో పాటు ఎండాకాలం ఉండడంతో మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగు సతీశ్‌గౌడ్, సూరజ్ ముదిరాజ్, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వద్దు

చార్మినార్,మార్చి 28 : కుల ధ్రువీకరణ పత్రాల జారిలో జాప్యం లేకుండా త్వరితగతిన విచారణ చేపట్టి అందించేందుకు అధికారులు కృషి చేయాలని బహదూర్ పుర కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన బహదూర్ పుర తహసీల్దార్ చంద్రశేఖర్ గౌడ్ ను కలిసి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అర్హులైన లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాలు సైతం అందించాల్సి ఉంటుందని తెలిపారు. కుల, ఆదాయ ధ్రువ